# గణములకు అధిపతి గణపతి

వినాయకుడు విద్యాప్రదాయకుడు. నాయకుడు. ప్రపంచములో ఎందరో ఆదర్శవంతులున్నారుగాని వినాయకుడంతటివాడు లేడు. విఘ్నేశ్వరుడని మరొక పేరు. విఘ్నములకధిపతి. యముని అనుగ్రహమువలన జనన మరణములు సంభవిస్తే గణేశుని అనుగ్రహమువలన విఘ్నములు తొలగిపోతాయి. గణపతి అనగా గణములకు అధిపతి. శబ్దముల కధిపతి. ప్రణవ స్వరూపుడు. ఓంకార స్వరూపుడు.

గణపతికి ఏనుగుతల. దీని అంతరార్థమేమిటి? ఏనుగు తల అధికమైన తెలవితేటలకు చిహ్నము. అతను సుబుద్ధి కనుక బుద్ధి ప్రసాదిస్తాడు. అందుకే బుద్ధి వినాయకుడు అని మరొకపేరు. మనము కోరిన కోరికలు ప్రసాదిస్తాడు కనుక సిద్ధి వినాయకుడని మరొకపేరు.

ఒకానొకప్పుడు వ్యాసుడు మహాభారతము వ్రాయదలచాడు. అయితే అది చాలా కఠినమైన పని. ఎందుకనగా దాంట్లో నూరుకోట్ల శ్లోకాలు ఉండేవి. వ్యాసుడు దేవగురువైన బృహస్పతిని ప్రార్థించాడు. వినాయకుడు తప్ప నీకు మరెవ్వరు సహాయము చేయగలిగేవారు లేరని బృహస్పతి తెల్పగా వెంటనే వేదవ్యాసుడు వినాయకుని ప్రార్థించాడు. అంతలోనే వినాయకుడు ప్రత్యక్షమయ్యాడు.

వ్రాసే ప్రతి పదములో అర్థము ఉండవలెనని అర్థము చేసుకున్న తర్వాతనే వ్రాయవలెనని పదము పదముల మధ్య సమన్వయము ఉండవలెనని వ్యాసుడు ఒక షరతు పెట్టాడు. గణపతి కూడా విరామము లేకుండా, గుక్కతిప్పుకోకుండా చెప్పవలెనని తన ఘంటమును (ఆ కాలమునాటి కలము) నిలువకూడదని షరతు పెట్టినాడు. వినాయకుడు జ్ఞానస్వరూపుడు కనుక మహాభారతము సంపూర్ణముగా అర్థము చేసుకొని వ్రాసినాడు. కనుకనే వ్యాసుడు అతని సహాయముతో మహాభారతము వ్రాయగలిగినాడు.

sri sathyasaivachanamrutam

వ్యాసుడు చెప్పటము వినాయకుడు వ్రాయటము. అట్లా మహాభారతము వ్రాయబడినది. దీనిలో అన్ని వేదములలోని సారము ఉన్నది. పూర్వము మహర్షులు తపస్సు చేసేవారు. కొందరు మధ్యలో వదలివేసేవారు. కొందరు పూర్తి చేయగలిగేవారు. తమస్సు తీసివేస్తే మోక్షప్రాప్తి జరుగుతుంది. గణములకధిపతియైన గణపతి, వాచస్పతి కనుక మహాభారతము వ్రాసినాడు.

ఏనుగుతెలివికి ప్రతీకము. మూషికము గణపతి వాహనము. అది చాలా చురుకైనది. అనగా మనము అన్నికార్యములు సక్రమముగా, చురుకుగా చేయవలసినదని భావము. అడవిలో అన్ని మృగములు సంచరించినప్పటికిని అన్ని జంతువుల పాదముద్రలు ఏనుగు పాదముద్రలో లీనమైపోతాయి. ఘోరారణ్యములో ఏనుగు ఒక్కసారి ముందు నడిచిందంటే దారి ఏర్పడుతుంది. కనుక గణపతిని ముందుపెట్టుకొని పోతుంటే జీవితారణ్యములో మన నడక సుఖంగా సాగుతుంది.

వినాయక చవితి రోజు విద్యార్థులు పుస్తకములను గుడిముందు పెట్టి భగవంతుని ప్రార్థిస్తారు బుద్ధి ప్రసాదించమని. అందుకే విద్యాదాయకుడని పేరు. మనకు ఏ పనుల్లోను విఘ్నము కలగకుండ వినాయకుని ప్రార్థిస్తాము. అతని ఏనుగుతలను, పెద్ద బొజ్జను చూచి వికారుడని భావించరాదు. అతని భక్తి మహత్తరమైనది. సర్వప్రపంచము తనలో ఉన్నట్టు నిరూపించినవాడు వినాయకుడు.

అతను శుక్లాంబరధరుడు. అనగా తెల్లని వస్త్రములు ధరించినవాడు. విభూతి సుందరుడు. నాలుగు చేతులు కలిగినవాడు. ఎల్లప్పుడు ప్రసన్న వదనముతో దర్శనమిస్తాడు. తెల్లని వస్త్రములు ధరించుటచే అతని హృదయం నిశ్చలమని, నిర్మలమని సూచిస్తుంది. మనము కూడా విశాల హృదయులైతే అతని అనుగ్రహము సంపాదించగలము. ప్రపంచములో అన్నియు అశాశ్వతములు అని చెప్పుతుంది విభూతి. ఆత్మతత్త్వమొక్కటే శాశ్వతమని నిరూపిస్తుంది. మనిషికి రెండు చేతులుంటే వినాయకునికి నాలుగు చేతులున్నాయి. ఎల్లప్పుడు అతని రెండు హస్తములు మానవాళికి సహాయంగా ఉంటున్నాయి కనుక అవి కనపడవు.

ఎల్లప్పుడు అతనికి సమభావము ఉంటుంది. దుఃఖములు వస్తాయి పోతాయి. సుఖములు వస్తాయి పోతాయి. అయితే మనము వినాయకునివలె సమతాభావము కలిగి ఉండవలెను.

srisathyasaivachanamrutam

రాత్రి అయిన వెంటనే పగలు వచ్చినట్లు, ఉష్ణము వెంట శీతలము వచ్చినట్లు దుఃఖమువెనువెంట సుఖము కూడా వస్తుంది. ఆనంద ప్రాప్తి కావలెనంటే దుఃఖము త్యజించాలి.

ప్రపంచము కష్టపూరితమైనది కాదు. అది పవిత్రమైనదే మనమే దానిని కలుషితము చేస్తున్నాము. సూర్యుడు తేజోవంతముగా ప్రకాశిస్తున్నాడు. చంద్రుడు వెన్నెల వెలుగు ఇస్తున్నాడు. కానీ మనమే కలుషితము చేస్తున్నాము. పారేనీటిలో మన ప్రతిబింబము చంచలముగా కనుపిస్తుంది. అదే స్థిరమైన స్వచ్ఛమైన నీటిలో చూస్తే మన ప్రతిబింబము నిశ్చలముగా ఉంటుంది. దోషము నీలోపెట్టుకొని ఇతరులను నిందించరాదు. వినాయకుని ప్రార్థించేటప్పుడు స్థిరమైన బుద్ధిని పవిత్రమైన బుద్ధిని నిలుపుకో.

**(తేది. 04-09-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam